క్లుప్తంగా

జీపీ వర్కర్ల యూనియన్ సహాయ కార్యదర్శిగా గోపాల్‌రావు



జూలూరుపాడు: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధం) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జూలూరుపాడుకు చెందిన ఏదులాపురం గోపాల్‌రావు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని గోపాల్‌రావు ఆదివారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. 5న నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగినట్లు తెలిపారు.

సమస్యలపై పోరాటంలో అలుపెరగని యోధుడు గిరిప్రసాద్

పాల్వంచ: కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు నల్లమల గిరిప్రసాద్ 94వ జయంతి సందర్భంగా స్థానిక సీఆర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విశ్వనాథం మాట్లాడుతూ... ఆయన ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నరహరి నాగేశ్వరరావు, అజిత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ట్యాంకర్

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద గేదెను తప్పించబోయిన యాష్ ట్యాంకర్ డివైడర్, విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. వివరాలు... శనివారం తెల్లవారుజామున మండల పరిధి బీసీఎం జాతీయ రహదారి పెద్దమ్మగుడి వద్ద భద్రాచలం నుంచి వస్తున్న యాష్ ట్యాంకర్‌కు గేదె అడ్డురావడంతో డ్రైవర్ దానిని తప్పించబోయి డివైడర్ ఢీ కొట్టాడు. దీంతో డివైడర్ ధ్వంసమై, మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా స్తంభం విరిగి రూ.లక్ష నష్టం వాటిల్లిందని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంకర్ డ్రైవర్ రవికుమార్ పండింట్‌పై కేసు నమోదు చేశారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న గెర్షోము

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలని గాంధీపథం జిల్లా అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోము అన్నారు. ఆదివారం గద్దర్ జయంతిని కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించి శాంతికపోతాన్ని ఎగరవేసి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గెర్షోము మాట్లాడుతూ... గద్దర్ తన ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచి, హక్కులను తెలియజేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలు నెరవేర్చడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. చింతలచెర్వు ఎర్నష్ఠ, అల్లు దీపు, నరేందర్ రెడ్డి, జ్ఞాన వినోదిని, ఎలిజిబెత్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పాల్వంచరూరల్: ఓ వివాహిత రెండురోజుల క్రితం అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు... లక్ష్మీదేవిపల్లిలో నివాసం ఉంటున్న 23 సంవత్సరాల వివాహిత శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైందని తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

శ్రీకాంత్‌కు నివాళి

ఇల్లెందు/టేకులపల్లి: సీపీఎం రాష్ట్ర నాయకులు ఖమ్మానికి చెందిన ఎర్రా శ్రీకాంత్ అకస్మికంగా గుండె పోటుతో మృతి చెందటం విషాదకరమని, ఆయన మరణం సీపీఎం, పేదలకు ఎంతో నష్టం అని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ అన్నారు. ఆదివారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. అదేవిధంగా టేకులపల్లిలో పార్టీ మండల కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది.
సింగరేణి(కొత్తగూడెం): ఎర్రా శ్రీకాంత్ మరణం ఉద్యమానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రామాచారి, బాలరాజు, శ్రీనివాస్, శ్రీధర్, రవికుమార్ పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం..

సీతారాముల కల్యాణం



చుంచుపల్లి: విద్యానగర్‌లో.. భక్తులకు అమ్మవారి తాళి చూపుతున్న పురోహితుడు

జగదానంద కారకుడైన జగదభిరాముడు, సీతాదేవిల కల్యాణ మహోత్సవం వాడవాడలా కనుల పండువగా జరిగింది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రతి గ్రామంలో చలువ పందిళ్లలో సర్వాలంకరణ భూషితుడైన శ్రీరాముడు, జానకీ మాత ఉత్సవ విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ క్రతువును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలన్నీ కిటకిటలాడాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సీతారాముల విగ్రహాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న దంపతులు



పాల్వంచరూరల్: పాండురంగాపురంలో విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు



సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో...



ఇల్లెందు: నంబర్-2 బస్తీ రామాలయంలో...



పాల్వంచ: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో...





కొత్తగూడెంటౌన్: శ్రీపాండురంగ భజన మందిరంలో..., కల్యాణం జరుపుతున్న వేద పండితులు



చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్ కాంప్లెక్స్‌లో భక్తులకు పులిహోర, పానకం, మజ్జిగ పంపిణీ



ఇల్లెందురూరల్: ఆంజనేయపురంలో...



జూలూరుపాడు: రాజారావుపేటలో..



టేకులపల్లి: శాంతినగర్‌లో...



శ్రీకోదండ రామాలయం వద్ద అన్నదానం



జూలూరుపాడు: పడమటనర్సాపురంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సుజాతనగర్: సర్వారంలో..

విద్యార్థుల తల్లిదండ్రుల అమితానందం..

టేకులపల్లి: స్కూలుకే పరిమితం కాకుండా ప్రసార మాధ్యమాల ద్వారా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. ఆదివారం కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారమైన చిన్నారి లోకం కదంబ కార్యక్రమంలో విద్యార్థులు అర్ధగంట సేపు తమ చదువులకు సంబంధించిన, నేర్చుకుంటున్న విద్యను కథలు, పాటలు, గేయాలు, నాటికలు, పొడుపు కథలు, సామెతలు, ఇంగ్లిష్ రైమ్స్ ప్రదర్శించి సత్తా చాటారు. గత నెల 26న ఆకాశవాణిలో ఈ విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమం ఆదివారం ప్రసారం కావడంతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసి, గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎం మేకల జ్యోతిరాణి సహకారంతో బొమ్మనపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు ఈ రేడియో కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా విన్నారు.

పిల్లల ప్రతిభా పాటవాలను రేడియో ద్వారా విన్న తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



పాఠశాలలో రేడియోలో విద్యార్థుల కదంబ కార్యక్రమం వింటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బొమ్మనపల్లి చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆకాశవాణి కేంద్రం ద్వారా తమ వాణిని వినిపించి స్కూలుతో పాటు, తమ గ్రామం యొక్క ప్రతిష్టను ఇనుమడింపజేశారు. విద్యార్థుల ప్రతిభ ఆకాశవాణి ద్వారా విన్న టేకులపల్లి ఎంఈఓ జగన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎం మంగీలాల్ హర్షం వ్యక్తం చేశారు.

ఏరియా మేనేజర్‌కు సన్మానం

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా కేఓసీ మేనేజర్‌గా విధులు నిర్వహించి బదిలీపై మణుగూరు ఏరియా పీకే ఓసీకి వెళ్తున్న ప్రాజెక్టు అధికారి సౌరభ్ సుమన్‌ను ఇల్లెందు ఏరియా ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, పీఓ కేఓసీ గోవిందరావు, ఇతర అధికారులతో కలిసి ఘనంగా సత్కరించారు. సింగరేణి సంస్థలో వివిధ కేటగిరిలలో పని చేసి బదిలీపై వెళ్తున్నారని, ఆయన సేవలు మరువలేనివన్నారు.
టేకులపల్లి: కోయగూడెం ఓసీలో మేనేజర్‌గా పని చేసి మణుగూరుకు బదిలీపై వెళ్తున్న సౌరభ్ సుమన్‌ను ఆదివారం కేఓసీలో సింగరేణి కాలరీస్ వర్కర్లు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు విద్యా రత్న అవార్డు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు స్ఫూర్తి విద్యా రత్న అవార్డు లభించింది. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఇటీవల పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనిలో బిట్-బిట్ డ్యాన్స్ అకాడమీ–దేవాకళా బృందం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. విద్యారంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్ వెంకటేశ్వరరావును అతిథులు, నిర్వాహకులు సన్మానించి, అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు.

దర్గాలో నవమి వేడుకలు

ఇల్లెందురూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ చిల్లా దర్గా ప్రాంగణంలో హిందూ, ముస్లింలు ఐక్యతను చాటుతూ శ్రీసీతారాముల కల్యాణ క్రతువును ఆదివారం వైభవంగా నిర్వహించారు. సత్యనారాయణపురం గ్రామ శివారులో కొలువుదీరిన దర్గా ప్రాంగణంలో ప్రత్యేకంగా చలువ పందిరి వేసి ముస్తాబు చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించారు. పలు గ్రామాలకు చెందిన దంపతులు కల్యాణ వేడుకలో సీతారాముల పక్షాన కూర్చొని ప్రత్యేక పూజ చేశారు. అంతేకాకుండా గ్రామంలోని పోకల దమ్మక్క వారసులు గోటితో సిద్ధం చేసిన గోటి తలంబ్రాలు, దర్గా ప్రతినిధులు ప్రత్యేకంగా తెప్పించిన నాణ్యమైన ముత్యాలను భద్రాచలం నుంచి



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

సేకరించిన గోటి తలంబ్రాలతో కలిపి సీతారాముల కల్యాణ వేడుకలో వినియోగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సోమవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దర్గా ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బీఆర్‌ఎస్ అడుగుజాడల్లో కాంగ్రెస్

సింగరేణి(కొత్తగూడెం): గత బీఆర్‌ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని ప్రభుత్వాలు ప్రశ్నించేవారిని అరెస్ట్ చేయటం దుర్మార్గమని, ఈ అక్రమ ఆరెస్టులను ఖండించాలని సీపీఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా) లక్ష్మీదేవిపల్లి మండల సంయుక్త కార్యదర్శి పెద్దబోయిన సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులను ముందస్తు అరెస్ట్ చేయటం దుర్మార్గమన్నారు.
జూలూరుపాడు: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ అడుగుజాడల్లోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు అన్నారు. ఆదివారం మండలకేంద్రం జూలూరుపాడులో మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం దుర్మార్గమని, అక్రమం అరెస్టులను ఖండించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామిక హక్కులను కాపాడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలానికి వస్తున్నారని ముందుస్తుగానే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కెచ్చల రంగారెడ్డి, ఆర్.మధుసూధన్‌రెడ్డిలను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



కార్మికులు, ఉద్యోగులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సింగరేణి వైద్యులు

టేకులపల్లి: రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కోయగూడెం ఓపెన్ కాస్టులో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు ఏరియా సింగరేణి వైద్యులు మల్లారెడ్డి, కశ్యప్ అన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం కేఓసీలో వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రతలపై కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీపీ, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యుల సలహా మేరకు ఆహార నియమాలు పాటించాలన్నారు. అదేవిధంగా వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపరితల గనులలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రత్యేకంగా మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించడంతో పాటు ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా చల్లని తాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పీఓ గోవిందరావు, మేనేజర్ సౌరభ్ సుమన్, పి.శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీకాంత్, సీనియర్ పర్సనల్ అధికారి అజయ్, గుర్తింపు సంఘం తరపున కే.వెంకటేశ్వర్లు, ప్రాతినిధ్య సంఘం తరపున అశోక్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యం

భారతీయ జనతా పార్టీ దేశ సమగ్రాభివృద్ధికి పని చేస్తోందని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. మాట్లాడుతూ... ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంవైపు పరుగులు తీస్తోందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



జూలూరుపాడు: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రమేష్

పీహెచ్‌సీలో అందని 24 గంటల వైద్యం

- స్థాయి పెరిగినా.. సేవలు అంతంతే
- సరిపడా వైద్యులు, సిబ్బంది లేక ఇక్కట్లు

సుజాతనగర్: మండల కేంద్రం సుజాతనగర్‌లోని ప్రభుత్వాస్పత్రిని 24 గంటలు సేవలందించే ఆస్పత్రిగా ప్రకటించి రెండేళ్లయినా అమలుకు నోచుకోలేదు. ఆస్పత్రికి అనుగుణంగా వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో గతంలో మాదిరిగానే ప్రతీరోజు సాయంత్రం మూతపడుతోంది.

సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం... చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలో విస్తరించి ఉండగా.. ఆయా మండలాల్లోని 60 గ్రామాల ప్రజలకు వైద్యం అందించాల్సి ఉంటుంది. దీంతో ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యం అందించనున్నట్లు రెండేళ్ల క్రితం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ దాని అమలును పట్టించుకున్న దాఖలాలు లేవు.

సౌకర్యాల లేమి..

24 గంటల ఆస్పత్రిగా ప్రకటించిన అధికారులు అందుకు తగినట్లుగా సిబ్బందిని నియమించలేదు. ఒక స్టాఫ్ నర్స్, నైట్ వాచ్‌మెన్, కాంటినెంట్ వర్కర్ నియామకాలు జరగలేదు. ఇక 108 వాహనాన్ని భద్రపరిచేందుకు షెడ్ లేదు. దీంతో ఆరోగ్య సేవల్లో మేటిగా నిలిచి కాయకల్ప, ఎన్‌క్వాస్ అవార్డులు



సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రి

దక్కించుకున్న ఈ ఆస్పత్రికి వచ్చే వారికే కాక, విధులు నిర్వహించే ఉద్యోగులకూ తిప్పలు తప్పడం లేదు. ఆస్పత్రిలో ఇద్దరు రెగ్యులర్ వైద్యులు ఉండగా.. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఇద్దరు స్టాఫ్ నర్సుల్లో ఒకరు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. కాగా, సుజాతనగర్ పీహెచ్‌సీ పరిధిలో 12 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో కూడా మొదటి, రెండో ఏఎన్‌ఎంల కొరత ఏళ్లుగా వేధిస్తూనే ఉంది. చాలా చోట్ల ఏఎన్‌ఎంలు లేక వైద్యం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌సీ పరిధిలో 50 వేల జనాభా ఉండగా.. ఆరు పడకలే ఉండటంతో వైద్యం అందించడం వైద్యసిబ్బందికీ కష్టమవుతోంది. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిని సరిపడా నియమించి 24 గంటల పాటు వైద్యం అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి..



24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినా అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించలేదు. దీంతో ఫలితం ఉండటం లేదు. ఎక్కువగా గిరిజనులున్న ప్రాంతమిది. జ్వరాలు, ఇతర వ్యాధులు, ప్రమాదాల బారిన పడినవారు చికిత్స కోసం వస్తుంటారు. ఇకనైనా వైద్యులను నియమించి పడకలు పెంచాలి.
– కాట్రాల తిరుపతిరావు, సింగభూపాలెం

వైద్యులు అందుబాటులో ఉండాలి..



గ్రామాల్లోని సబ్ సెంటర్లలో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తే ఏ ఇబ్బందీ ఉండదు. ఈ విషయాన్ని గుర్తించి వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలి. లేదంటే ఈ ప్రాంతంలోని పేద ప్రజలకు వైద్య ఇబ్బందులు తప్పవు.
– జర్పుల కుమార్, సర్వారం